

నేటి దినపత్రిక
www.suryaa.com

నల్గొండ
యాదాద్రి
సూర్యాపేట

సోమవారం 23, జూన్ 2025 పేజీలు - 8


రాబోయే మూడున్నరేళ్లలో...

# రాష్ట్రంలో 20 లక్షల ఇండ్లు కట్టించి తీరుతాం

- ఆగస్టు 15 నాటికి భూభారతి కింద వచ్చిన న్యాయమైన దరఖాస్తులన్నింటిని పరిష్కరించి రైతులకు స్వాతంత్రం కల్పిస్తాం

- రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి









**ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతన నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు చొప్పున రానున్న మూడున్నర ఏళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రి నల్గొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూభారతి అమలులో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 8 లక్షల, 60,000 దరఖాస్తులు వచ్చాయని, ఆగస్టు 15 నాటికి వీటిలో న్యాయమైన వాటిని పరిష్కరించి రైతులకు స్వతంత్రాన్ని కల్పించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. లబ్ధిదారులు 400-600 చదరపు అడుగులో ఇల్లు నిర్మించుకోవాలి, గతంలో చేపట్టి మొండిగోడలు దర్శనమిస్తున్న ఇళ్లకు పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. భూభారతి చట్టం భూములున్నఆసాములకు చుట్టమయింది. భూభారతిపై నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది లక్షల అరవై వేల దరఖాస్తులు వచ్చాయి అని పేర్కొన్నారు. రాబోయే వారం రోజుల్లో వీటన్నిటిని కంప్యూటరైజ్ చేసి న్యాయమైన సమస్యలన్నింటిని ఆగస్టు 15లోగా పరిష్కరిస్తామని భూభారతి ద్వారా పూర్తి ప్రక్షాళన చేసి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఆగస్టు 15 నాటికి రైతులకు భూముల విషయంలో స్వాతంత్రం కల్పిస్తామని, రాష్ట్రప్రభుత్వంప్రత్యేకించి ప్రజాపాలన ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకు ఎల్పిజి పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పరిమితిని 10 లక్షలకు పెంచామన్నారు. ఉగాది నుండి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, సంవత్సరంలోపే 60 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, రైతు భరోసా ఇచ్చిన ఘనత తమదని, ఎకరాకు 12 వేల రైతుభరోసా పెంచామన్నారు. తొమ్మిది రోజుల్లో 9000 కోట్ల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేశామన్నారు. శాంతిభద్రతలు కాపాడడంలో మిగతా 2లో

# డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం



మోతే, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని మామిల్లగూడెం గ్రామంలో డ్రగ్స్, గంజాయి, మాదాకద్రవ్యాల పై గ్రామంలోని ప్రజలకు అవగాహన కార్యక్రమం సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. గ్రామాల్లోని ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకి పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు, డ్రగ్స్ పట్ల విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు డ్రగ్స్ వ్యవస్థ పై పోలీసు వ్యవస్థకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. రైతులు నకిలీ విత్తనాలు బయట తీసుకోకూడదని కంపెనీ విత్తనాలు లైసెన్స్ ఉన్న దుకాణాల్లో కొనుగోలు చేయాలని రైతులని కోరారు. ఇట్టి కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వీరారెడ్డి, మామిళ్లగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కొరివీరస్వామి, వెంకన్న, నిమ్మల శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే వారమే స్థానిక షెడ్యూల్......?

- ఎన్నికల సన్నాహాల్లో బిజీగా తెలంగాణ ఎస్ఈసీ..!

- నేటి క్యాబినెట్ భేటీలో అదే ప్రధాన ఎంజెండా..!

- రైతుభరోసా నిధుల జమ పూర్తయిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ విడుదల.....?

- రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నగరా మోగనున్నదా........?

**భువనగిరి జిల్లా బ్యూరో**




వచ్చే వారంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడనున్నదా....? అంటే అవుననే అంటున్నాయి.అత్యంత విశ్వసనీయవర్గాలు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే మంత్రులతో జరిగిన సమావేశాల్లోనూ ఎన్నికల సన్నాహాలపై ఆదేశాలు జారీచేసినట్టు తెలిసింది. అనవసర ప్రకటనలు లేకుండా, పూర్తిస్థాయిలో సిద్ధమవ్వాలని సూచించినట్టు సమాచారం.గ్రామ పంచాయతీలు సహా మండల, జిల్లా పరిషత్‌లు,మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.రైతుభరోసా పథకం కింద నిధులు జమచేసే ప్రక్రియ పూర్తయిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ వెలువడనున్నట్టు సమాచారం.ఈ పథకం ద్వారా రైతులకు ఆర్థికసాయం అందించి గ్రామీణ ఓటర్ల మద్దతు పొందాలని చూస్తున్నట్టు తెలిసింది.అందుకే గత వేసవిలో మూడెకరాలకే రైతు భరోసా నిధులను విడుదల చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు.. గ్రామీణ ఓటర్ల కోసం ఇప్పుడు అందరికీ వేయాలని భావిస్తున్నది. నేడు జరిగే క్యాబినెట్ సమావేశంలో రైతుభరోసా నిధుల విడుదల,స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ అంశాలే ప్రధాన ఎజెండా చర్చించనున్నట్టు తెలిసింది.రాజీవ్ యువవికాసం పథకం వాయిదా పడిన నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్లు,రైతుభరోసా పథకాలు తమను గట్టెక్కిస్తాయని కాంగ్రెస్ సర్కారు ఆశతో ముందుకు సాగుతున్నది.ఈ నేపథ్యంలోనే ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. అయితే దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో కేసు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల అంశంపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు పెండింగ్ ఉన్నది.ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల విషయం లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలని సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది. ఎన్నికలకు ముందే రిజర్వేషన్ ప్రక్రియ పూర్తికి కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది.తెలంగాణ రాష్ట్ర ఎన్నికల మిగతా 2లో

# 2,76,787 మంది రైతుల ఖాతాలలో రైతుబరోసా నిధులు జమ



## జిల్లా కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్, మేజర్‌న్యూస్ ః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుబరోసా పథకం కింద ఇప్పటి వరకు జిల్లాలోని 2,91,787 మందికి గాను 2,76,787 మంది రైతుల ఖాతాలలో రూ.327.39 కోట్ల నిధులు జమ అయ్యాయని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడమే లక్ష్యం

## కోతులారం ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల జగదీశ్వర్ గౌడ్



మునుగోడు, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని కోతులారం ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుల జగదీశ్వర్ గౌడ్ అన్నారు.ఆదివారం మండలంలోని కోతులారం గ్రామానికి పలువురు ఉద్యోగస్తులు ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించేందుకు పలు తీర్మానాలు చేశారు.గ్రామంలో ఉన్న 1 నుంచి 5 వ తరగతి పిల్లల్ని బయట ప్రైవేట్ పాఠశాలలకు తరలించకుండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని, డిజిటల్ క్లాసులు, ట్యూషన్ టీచర్ ఏర్పాటు అంశాలపై అవగాహన తల్లిదండ్రులకు కల్పించారు. టీచర్లతో సమావేశమై, పాఠశాలలో ఉన్న సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాటి వనం గ్రూప్ నుండి డిజిటల్ ప్రొజెక్టర్ విధానం ద్వారా అందిస్తామన్నారు.ప్రతిరోజూ సాయంత్రం 4%-%6 గంటల వరకు ఉపాహారంతో కూడిన ప్రైవేట్ ట్యూషన్ ఏర్పాటు చేస్తామన్నారు.తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు, పురోగతి నివేదికలు తీసుకుంటామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో క్రీడా యూనిఫాం, షూస్, బెల్ట్, ఇతర క్రీడా సామాగ్రి పంపిణీ. ఈ నెల 29 న శనివారం పాఠశాలలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హాలియా, మేజర్‌న్యూస్ : వివేకానంద విద్యాలయం హాలియా నందు పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం 2008-09 విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ వేడుకలలో వివేకానంద విద్యాలయం యాజమాన్యం గుర్రం ప్రభాకర్ రెడ్డి సత్యనారాయణ రెడ్డి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైదులు , పాఠశాల ఉపాధ్యాయులు సయ్యద్, సోమయ్య, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి 2008- 09 వ సంవత్సరంలో చదివిన విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.



# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల దిమ్మెలు కట్టాల్సింది ఎవరు?

## రైతులా ? లేక కాంట్రాక్టర్ కట్టించాలా?

## అధికారుల నిర్లక్ష్యమా ? లేక కాంట్రాక్టర్‌ల దౌర్జన్యమా?



గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : గుర్రంపోడ్ మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల దిమ్మెల పంచాయతీ నడుస్తుంది. రైతులు డిడిలు కట్టాక విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మంజూరవుతాయి, అనంతరం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు దిమ్మెలు నిర్మించాల్సి ఉంటుంది.ఐతే ఇదే విషయమై రైతులకు, విద్యుత్ కాంట్రాక్టర్ లకు మధ్య గొడవలు జరుగుతున్నాయి.అసలు డీడీలు కట్టాక రైతుల పొలంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ని ఏర్పాటు చేసే బాధ్యత కాంట్రాక్టర్ కే ఉంటుంది కానీ అది జరగట్లేదు. రైతులు దిమ్మెలు కడితేనే మేం ట్రాన్స్ఫార్మర్ బిగిస్తామని కాంట్రాక్టర్ లు రైతుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు తెలుస్తుంది.అధికారులు ఇప్పటికైనా రైతులపై కాంట్రాక్టర్ల దౌర్జన్యాన్ని ఆపాలని, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ దిమ్మెలు కాంట్రాక్టర్లు నిర్మించే విధంగా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

# కాచరాజు జయప్రకాష్ జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలి

## అక్షింతల కృష్ణమూర్తి, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు

భువనగిరి జిల్లా బ్యూరో



సాహిత్య, సామాజిక , ఆద్యాత్మిక కార్యకర్త కాచరాజు జయప్రకాష్ జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలని విద్యావంతుల వేదిక యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు అక్షింతల కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం భువనగిరి లోని కాచరాజు మినీ కాన్ఫరెన్స్ హాల్లో కాచరాజు జయప్రకాష్ రెండవ వర్ధంతి సమావేశం బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకవరం రమేష్, కార్యదర్శి దానం రామేశ్వర్ రావు ల అద్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కృష్ణమూర్తి మాట్లాడుతూ కాచరాజు జయప్రకాష్ ఉపాధ్యాయునిగా, సామాజిక కార్యకర్తగా, వివిధ ప్రజా సంఘాల నాయకునిగా, నిత్యం సభలు, సమావేశాలు, చైతన్య సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులను చేసేవాడని ఆయన అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆయన నిత్యం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించే వాడని ఆయన అన్నారు. కాచరాజు కుటుంబ సభ్యులు కాచరాజు జయప్రకాష్ పేరుతో ఒక సేవా సంస్థను ఏర్పాటు చేసి సేవాకార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఈ వర్ధంతి సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు పోచంపల్లి రమణారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందుపట్ల విశ్వేశ్వర్ రావు, బి జె పి సీనియర్ నాయకుడు చందుపట్ల వెంకటేశ్వర్ రావు, బి జె పి పట్టణ మాజీ అధ్యక్షులు పాదరాజు ఉమాశంకర్, ప్రముఖ సాహితీవేత్త పాలకుర్తి రాంమూర్తి, సామాజిక కార్యకర్తలు కొడారి వెంకటేష్, ఎస్కే హమీద్ పాషా, ఎస్.ముత్తి రెడ్డి, ఎన్ వి డి నాగేశ్వరరావు, చకిలం సురేందర్ రావు, చందుపట్ల రామ్మోహన్ రావు, కాచరాజు విజయలక్ష్మి, జ్యోతి, చందుపట్ల రజని, కాచరాజు మేనల్లుడు శ్రీకాంత్, కాచరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీ స్వామివారికి ఘనంగా తిరువీధి ఉత్సవ సేవ

భువనగిరి జిల్లా బ్యూరో



కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 7 గంటలకు అనంతనామధేయుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను నిర్వహించారు. అనంతరం లక్ష్మి మంటపంలో లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సుదర్శన నరసింహ ఇష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10:30 లకు జగదేక చక్రవర్తి అయిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సువర్ణభరిత వజ్రాభరణాలతో,సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి విశిష్ట కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30 కు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

# దేవా నాయక్ ఆలయ అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలి

యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట మం డలం మల్లాపురం గ్రామ పరిధిలో గల దేవా నాయక్ దేవనాయకులమర్రి ఆలయంలో అభివృద్ధికి అధికారులు, దేవాదాయ శాఖ కృషి చేయాలని దేవ నాయక్ ఆలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ కృష్ణ నాయక్ అన్నారు. ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా అనేక రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు వస్తున్నారని అన్నారు. భక్తులు సమర్పించే కానుకలు బంగారం, వెండి వస్తువులు లెక్క తేల్చాలని అన్నారు. అదేవిధంగా ఈ ఆలయంలో అనేకమంది భక్తులు కోడెలను సమర్పించుకుంటారని వాటికి సంబంధించిన వివరాలు కూడా తెలపాలని అన్నారు. ఆలయంలో ఎలాంటి అభివృద్ధి జరగకుండా ఎలాంటి అభివృద్ధికి నోచుకోకుండా ఉందని అన్నారు. దీనికి కారణం గత పూజారి అని అన్నారు. అందుకే తాము తమ కమిటీ తరపున ధరావత్ వెల్మ అనే నూతన పూజారిని నియమించామని అన్నారు. తమ ఎంపిక చేసిన పూజారిని దేవాదాయ శాఖ అధికారులు అధికారికంగా నియమించాలని కోరారు. గత పూజారి ఉన్నంత కాలంలో జరిగిన అభివృద్ధి పనులు ఇతర కార్యక్రమాలు కానుకల వివరాలు తెలియజేయాలని అన్నారు. కాదా దేవ నాయకు దేవస్థానంలో భక్తులకు వసతి సౌకర్యాలు లేవని వసతి సౌకర్యాలు కల్పనకు తమ కృషి చేస్తున్నామని ఇందుకు దేవాదాయ శాఖ అధికారులు కూడా చొరవ చూపించాలని అన్నారు. దేవనాయక దేవాలయాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని దేవాదాయ శాఖ అధికారులు కూడా తమకు సహకరించాలని కోరారు. ఇకనైనా తాము నియమించిన నూతన పూజారికి ప్రతి ఒక్కరు సహకరించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు చర్య నాయక్ సర్జన్ జగన్ కృష్ణా నాయక్ నవీన్ నాయక్ రమేష్ నాయక్ శంకర్ నాయక్ నూతన పూజారి ధరావత్ వెల్మ తదితరులు పాల్గొన్నారు.